కథ

# తమసోమా జ్యోతిర్గమయ

గన్నవరపు నరసింహమూర్తి

**ఆ రోజు రామారావ్ ఫేక్టరీకెళ్లే సరికి అతని ఆఫీసు ఆవరణంతా ఇంటర్వ్యూకొచ్చిన అభ్యర్థులతో క్రిక్కిరిసి ఉంది. ఆ రోజు వారంద రికీ మౌఖిక పరీక్ష, ఉన్నది ఒకే ఒక ప్రోగ్రామర్ పోస్ట్, వ్రాతపరీక్షలో 30 మంది దాకా సెలక్ట్ అయ్యారు. వీళ్ల నుంచి ఒక్కరిని ఎంపిక చేయడం నిజానికి కత్తిమీద సాము లాంటిదని రామారావ్‌కి తెలుసు.**

రామారావ్ ఆ కంపెనీలో వర్క్స్ మేనేజర్. పది హేను సంవత్సరాల నుంచి ఆ కంపెనీలోనే పని చేస్తూ చివరికి ఈ స్థాయికి చేరుకున్నాడు. ఇలాంటి ఇంటర్వ్యూలంటే అతనికి చాలా టెన్షన్. ఎంత నిజాయితీగా ఎంపిక చేసినా ఏవో విమర్శలు వస్తూనే ఉంటాయ్. అతను ఇప్పటివరకు మెరి ట్‌కే ప్రాధాన్యత ఇస్తూ వచ్చేడు. కానీ ఈసారి అలా జరగబోవటం లేదు.

ఈ పోస్ట్ గురించి పేపరులో ప్రకటన ఇచ్చిన ప్పుడే అది తన తమ్ముడికివ్వాలని అతని భార్య సుజాత కరాఖండీగా చెప్పడంతో అతనికి కాస్త ఇబ్బంది ఎదురైంది. ఎన్నో ఏళ్లుగా కంపెనీ కోసం ఎంతోమందిని ఉద్యోగాల కోసం ఎంపిక చేశాడు. కానీ ఒక్కనాడు కూడా పైరవీలకు లొంగలేదు. ఈసారి జీవితంలో తనని ఏనాడూ ఏ కోరికా కోరని తన జీవిత భాగస్వామి ఈ కోరిక కోర డంతో అతనికేం చేయాలో పాలుపోవటం లేదు.

ఆమె కోరిన కోరిక కూడా అంత అసమంజస మేమీ కాదు. తన మామగారు ఇంకో ఆర్నెల్లలో రిటైర్ కాబోతున్నారు. తన సర్వీసులో సంపాదిం చిందంతా ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్ల కోసం, కొడుకు చదువుకూ ఖర్చై పోవడంతో సొంత ఇల్లు కూడా కట్టుకోలేకపోయాడు. అందుకు అతను రిటైరయ్యేలోగా కొడుక్కి ఉద్యోగం వస్తే అతనికి చేదోడు వాదోడుగా ఉంటాడని ఆ కుటుంబం ఆశ. అందువల్ల వచ్చిన ఈ అవకాశాన్ని వదులుకో కూడదని అతని భార్య ఆలోచన.

ముందు వ్రాతపరీక్షలో పాస్ అవ్వనీ తర్వాత ఆలోచించవచ్చు అని ఆ రోజు తప్పించుకున్నా తీరా అతను ఆ పరీక్షలో పాసై కూర్చోవడంతో అతని సమస్య మళ్లీ ముందుకొచ్చింది. సరిగ్గా పది గంటలకు ఇంటర్వ్యూలు మొదలయ్యాయి. రామారావ్‌తో పాటు పర్సనల్ మేనేజర్, మరో మెకానికల్ ఇంజనీర్ ఇంటర్వ్యూ బోర్డ్‌లో ఉన్నారు. ఫైనల్ సెలక్షన్ మాత్రం వర్క్స్ మేనేజ ర్‌దే. లంచ్‌టైమ్‌కి అతని బావమరిది రఘుతో సహా పదిహేను మంది ఇంటర్వ్యూలు పూర్త య్యాయి. మిగతా వారికి లంచ్ తర్వాత చేద్దామని మిగతా ఇద్దరు మెంబర్లు లంచ్‌కి వెళ్లిపోవడంతో రామారావ్ ఒక్కడే తన ఛాంబర్‌లో ఒంటరిగా మిగిలాడు. అతనికి మొదట్నుంచీ లంచ్‌కి ఇంటికె ళ్లడం అలవాటు లేదు. తన ఛాంబర్‌లోనే లంచ్ చేయడం అతని అలవాటు. లంచ్ చేస్తుండగా ప్యూన్ వచ్చి ఎవరో ఒకామె తనని కలవాలని వచ్చిందని చెప్పగానే ఐదు నిమిషాల తర్వాత పంప మనీ చెప్పాడు. లంచ్ అయిన తరువాత ఆమె లోప లికొచ్చింది. చూడటానికి ఆమెకు ఏభై ఏళ్లుం టాయి. రాగానే నమస్కారం చేయడంతో అతను కూడా ప్రతినమస్కారం చేసి కూర్చోమని కుర్చీ చూపించాడు.

''చెప్పండి మేడమ్, మీరే విషయమై వచ్చారు? ఇంకో విషయం ఈ రోజు ఇంట ర్వ్యూలు జరుగుతున్నట్లు మీకు తెలుసనుకుం టాను. దయచేసి వాటి గురించి అయితే మాట్లా డవద్దు'' కరాఖండీగా చెప్పాడు రామారావ్.

ఆ మాటలు విన్న తరువాత ఆమె ముఖంలో రంగులు మారడం రామారావ్ గమనించాడు. ఆమె చెప్పడం ప్రారంభించింది.

''బాబూ! మా వారు ఈ కంపెనీలోనే మెకా నికల్ డిపార్ట్‌మెంట్‌లో ఫిట్టర్‌గా పనిచేసేవారు. పేరు రాజయ్య. చాలా మంచి వర్కరు అన్న పేరుండేది ఆయనకు. రెండేళ్ల క్రితం జబ్బు చేసి చనిపోయాడాయన. ఆయన డ్యూటీలో చనిపో లేదు కాబట్టి మా అబ్బాయికి ఉద్యోగం ఇవ్వలేదు ఈ కంపెనీ యాజమాన్యం''


''అవునమ్మా! డ్యూటీలో ఉన్నప్పుడు చనిపో తేనే అతని పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలన్నది ఈ కంపెనీ కార్మికులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఉంది. దానికి వ్యతిరేకంగా మేము ఏ పనీ చెయ్యలేం'' రామారావ్ మధ్యలో కల్పించుకుని చెప్పాడు.

''ఆ విషయం నిజమే బాబూ! ఇక్కడే నేను చెప్పిన కొన్ని విషయాలు వినండి. మా వారు చని పోయే నాటికి మా ఇద్దరబ్బాయిలూ, ఇద్దరమ్మా యిలూ ఎవ్వరూ అందుకు రాలేదు. అందరూ చదువుకుంటూ ఉండేవారు. మాకా ఆస్తిపాస్తు లేమీ లేవు. మా అత్తమామలిద్దరూ అనారో గ్యంతో బాధపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పెద్ద కుటుంబాన్ని ఎలా పోషించాలి చెప్పండి? ఆయనకొచ్చిన పి.యఫ్., గ్రాట్యుటీ అంతా ఖర్చైపోయింది. కంపెనీ ఇల్లు కూడా ఖాళీ చేయమంటే చేసేశాం. కొన్ని రోజులు తింటున్నాం, కొన్ని రోజులు పస్తులుంటున్నాం. అందుకే ఇన్ని రోజులు ఈ కంపెనీ అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. మా అబ్బాయికి ఉద్యోగం ఇవ్వండనీ.. కానీ ఒక్కరూ కరుణించ లేదు. ఈసారి ఈ ఉద్యోగానికి మా వాడు కూడా వ్రాత పరీక్షలో పాసై ఈ రోజు ఇంటర్వ్యూకి హాజరవుతున్నాడు. అందుకే చివరిసారిగా మిమ్మల్ని అభ్యర్థించడానికొచ్చాను. మీరే దయత లచి అతనికి ఈ ఉద్యోగం వచ్చేటట్లు చూడండి. మా కుటుంబాన్ని ఆకలి నుంచి కాపాడండి' ఆమె వస్తున్న ఏడుపునాపుకుంటూ చెప్పసాగింది.

అక్కడ సూది మొన పడితే వినిపించేటంతటి నిశ్శబ్దం.

''ఈ సమయంలో మిమ్మల్ని ఇక్కడకొచ్చి అభ్యర్థించడం తప్పనీ తెలిసినా మా ఈ పరిస్థితి ఈ పని చేయించింది. ఇరవై సంవత్సరాలు ఈ కంపెనీకై అహర్నిశలూ పనిచేసిన ఓ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవడం ఈ కంపెనీ బాధ్యత కాదంటారా? ఓ కార్మికుడి కుటుంబం ఆకలితో అలమటించి చనిపోతే ఈ కంపెనీకి శ్రేయస్కరం అవుతుందా? ఇదేమీ మీకు హెచ్చరిక చేయటం లేదు. మా కుటుంబాన్ని రక్షించమని చేతులెత్తి నమస్కరిస్తున్నాను. ఇదే నా వేడుకోలు'' సుదీ ర్ఘంగా ఆమె చెప్పిన మాటలు విన్న రామారావ్‌కి ఏం చెప్పాలో తోచక కాసేపు మౌనం వహించాడు. కొద్దిసేపటికి తేరుకొని ''నువ్వు చెప్పింది నిజమే నమ్మా! కానీ ఈ ఉద్యోగానికి అర్హత మెరిట్‌లో రావడం. మీ వాడు మెరిట్‌లో వస్తే తప్పక మీవా డికే ఇస్తాం. మీరు నిర్భయంగా వెళ్లిరండి'' అన్నాడు.

''మీ మాటతో నేనూ ఏకీభవిస్తాను బాబూ! కానీ ఒక ఉద్యోగం ఇవ్వడానికి అర్హత ఎంత ముఖ్యమో అది ఎవరికి అవసరమో అది కూడా చూడాలి'' అనీ ఆమె లేచి వెళ్లబోతూ మళ్లీ




అంది.

''ప్రస్తుతం ఈ ఉద్యోగం ఇవ్వడం అన్నది మీ చేతుల్లో ఉంది. ఇస్తే ఓ పేదకుటుంబాన్ని ఆకలి నుంచి రక్షించిన వారు అవుతారు. అప్పుడు మా కుటుంబం మీ పేరు, ముఖ్యంగా ఈ కంపెనీ పేరు చెప్పుకొని జీవితాంతం ఋణపడి ఉంటాము'' తరువాత కళ్లు తుడుచుకుంటూ బయటికి వెళ్లిపోయింది.

ఆమె వెళ్లిన తరువాత రామారావ్ మనసు గందరగోళంగా తయారైంది. అతనికేం చెయ్యాలో తోచటం లేదు. ఉన్నది ఒకటే ఉద్యోగం. ఈసారి దాన్ని ఎలాగైనా అతని తమ్ముడికే ఇవ్వాలని భార్య హుకుం ఒక వైపు. మా కుటుంబానికి ఆ ఉద్యోగాన్నిచ్చి ఆదుకోండని మరొకరి వేడుకోలు. అతను తల పట్టుకున్నాడు. ఇంటర్వ్యూలు పూర్తవ్వగానే త్వరగా ఇంటికెళ్లాలి అతను. ఎందుకంటే మర్నాడే తిరుపతి ప్రయాణం.

★ ★ ★

రామారావ్ కూతురికి ఆరో నెల. విశ్రాంతికై పుట్టింటి కొచ్చింది.

అలాగే అతని బావమరిది రఘు కూడా ఉద్యోగం కోసం పదిహేను రోజుల క్రితం రామారావ్ ఇంటి కొచ్చాడు. ఎలాగూ అతనికే ఉద్యోగం వస్తుంది కనుక తిరుమల వెళ్లి ఆ వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకోవాలని రామారావు భార్య సుజాత కోరిక. అలాగే పెళ్లయిన తరువాత తిరుపతి వెళ్లడం కుదరలేదు కాబట్టి కూతురు కూడా వస్తానంది. అన్నీ కుదరటంతో ఆ కుటుంబం తిరుపతి ప్రోగ్రాం పెట్టుకుంది. తన తమ్ముడికి తనే ఉద్యోగం ఇప్పిస్తున్నందుకే ఆమెకు చాలా గర్వంగా ఉంది. ఎప్పుడూ ఇటువంటి విషయాల్లో చాలా కఠినంగా వ్యవహరించే భర్త ఈసారి ఎందుకో మెత్తబడి తన తమ్ముడికే ఉద్యోగం ఇస్తాననడం అంతా ఆ స్వామి దయ అని సుజాత నమ్మకం. అందుకే ఆ మర్నాడు ఆ కుటుంబం తిరుపతి బయలుదేరింది.

★ ★ ★

తిరుమలలో దర్శనం బాగా ఆలస్యం అయింది. విపరీతమైన రద్దీ కావడంతోను, అందునా ముందుగా రిజర్వేషన్ లేకపోవడం వల్ల దర్శనానికి సుమారు పదిహేను గంటలు పట్టింది. రామారావ్ భయం అంతా తన కూతురు జానకి గురించే, ఆమె ఆర్నెలల గర్భవతి, దర్శనానికి క్యూలో నిల్చోడం వల్ల బాగా అలసటకు గురైంది. ఆమె ఆరోగ్యం గురించే అతని బెంగ. ఆమెకు దర్శనం అయిన తరువాత కడుపునొప్పి రాసాగింది. మొదట చిన్నగా ప్రారంభమైనా అది ఆ రాత్రి పది గంటలకి పెద్దదైంది. ఆ సమయంలో కడుపు నొప్పి వస్తే అబార్షన్ అయ్యే ప్రమాదం ఉంది. ఇంక ఉపేక్షించకుండా కొండ మీద టి.టి.డి. నడుపుతున్న హాస్పిటల్‌లో చూపిస్తే పరీక్షించి త్వరగా ఆమెను తిరుపతి మెయిన్ హాస్పిటల్‌కి తీసుకెళ్లమని అక్కడి డాక్టర్లు చెప్పడంతో రామారావుకి ఏం చేయాలో తోచలేదు. అప్పటికి సమయం అర్ధరాత్రి 12 గంటలు కావస్తోంది. త్వరగా రూము చేరుకొని సామాన్లను కార్లో

లోడు చేసుకొని తిరుపతి బయలుదేరారు.

అర్ధరాత్రి కావడంతో ఘాట్‌రోడ్డు అంతా నిర్మానుష్యంగా ఉంది. డ్రైవర్ చాలా స్పీడుగా పోనిస్తున్నాడు కారుని. కొద్దిసేపటికి భీకరమైన గాలి, వర్షం ప్రారంభమయ్యాయి. పెద్ద పెద్ద శబ్దాలతో ఉరుములు, మెరుపుల మధ్య కారు ప్రయాణం సాగుతోంది. ఆ భీకరమైన ఉరుముల శబ్దాలకు లోయ ప్రతిధ్వనిస్తోంది. రానురాను వర్షం పెద్దది కాసాగింది. ధారాపాతంగా కురుస్తున్న వర్షానికి కొండమీద నుంచి బండరాళ్లు దొర్లుకు రాసాగాయ్. కనురెప్ప తెరిచేటంతలో ఒక పెద్ద రాయి వీళ్ల కారుని రాసుకుంటూ లోయలోకి జారిపోయింది. క్షణం తేడా అయితే వీళ్ల కారు లోయలోకి పడిపోవలసింది. హోరు గాలికి తోడు చిమ్మ చీకటి, ధారాపాతంగా కురుస్తున్న వర్షం, మరో పక్క దొర్లుకొస్తున్న పెద్ద పెద్ద బండరాళ్లు.. ఏం చేయాలో తోచక డ్రైవర్ కారుని ఆపుచేసి చెప్పాడు. ''సార్! ఇప్పుడు కొండ దిగడం ప్రమాదం. ఇది కొద్దిగా తగ్గితే బయలుదేరుదాం''.

రామారావ్‌కి చాలా టెన్షన్‌గా ఉంది. వెనుక సీటులో కడుపు నొప్పితో కూతురు విలవిలలాడుతోంది. కోపంగా అన్నాడు..''అరే! పిల్ల కడుపునొప్పితో బాధపడుతోంది కదయ్యా! అసలే ఉట్టిమనిషి కాదు త్వరగా వెళ్లకపోతే ప్రమాదం. ఏం జరిగితే అది జరుగుతుంది బయలుదేరు'' కఠినంగా వెలువడిన రామారావ్ మాటలకి డ్రైవర్ చేసేది లేక కారుని మళ్లీ స్టార్ట్ చేయబోయాడు కానీ అది స్టార్ట్ కావడం లేదు. చాలా సేపు ప్రయత్నించినా అది స్టార్ట్ కాకపోవడంతో కారు డోరు తెరచి ''సార్! బండి స్టార్ట్ కావటం లేదు. కారణం తెలియటం లేదు. ఇది కొత్త బండి కూడాను. నాకైతే అర్థం కావట్లేదు'' ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ చెప్పాడు డ్రైవర్ రామారావ్‌తో.

ఈలోగా వెనకసీట్లో కూర్చున్న జానకి మెలికలు తిరిగిపోతోంది. ఆమెను పట్టుకోవడం సుజాతకి సాధ్యం కావట్లేదు. వెంటనే రామారావ్, రఘు కారు దిగి ఏవైనా కొండ మీద నుంచి వెహికల్స్ వస్తే ఆపాలని నిశ్చయించుకున్నారు. కాసేపటికి ఘాట్‌రోడ్డు మలుపులో లైట్ రిఫ్లెక్ట్ అవుతుండడంతో రామారావ్‌లో ఆశ మొదలైంది. ఆ వచ్చే వాహనాన్ని ఎలాగైనా ఆపాలని ఇద్దరూ విశ్వప్రయత్నం చేశారు కానీ అది ఆగలేదు. మళ్లీ నిరాశ. మరో పది నిమిషాలకు మరో రెండు వాహనాలు వచ్చాయి కానీ అవి కూడా ఆగలేదు. భోరున వర్షం కురుస్తుండడంతో ఎవ్వరూ బండ్లను ఆపే సాహసం చేయటం లేదు.


రామారావ్‌కి ఒక్కసారిగా నిస్పృహ ఆవహించింది. తను అనవసరంగా ఈ ప్రయాణం పెట్టుకున్నాడు. అతని మస్తిష్కం మొద్దుబారిపోయింది. ఏం చేయాలో అతనికి తోచటం లేదు. ఇంతలో కొండ క్రింద నుంచి ఒక వెహికల్ వస్తున్నట్లు లైట్ సూచించడంతో అతనిలో మళ్లీ ఆశ. ఎలాగైనా దీన్ని ఆపాలి. మరో మార్గం లేదు. ఇప్పటికే సమయం మించిపోతోంది. రానురాను ఆ వెలుతురు దగ్గరకాసాగింది. రామారావ్, రఘు, డ్రైవర్ ముగ్గురూ రోడ్డు మధ్యకు వచ్చి 'హెల్ప్' 'హెల్ప్' అని అరవడంతో కారు కొద్దిగా స్లో అయింది. కారు కొద్ది దూరంలో ఆగింది. అందులోంచి ఓ వ్యక్తి దిగాడు. పరుగున రామారావ్ అతని దగ్గరికి వెళ్లి పరిస్థితి వివరించి ఎలాగైనా అతని కారులో తన కూతురిని కిందకు తీసుకెళ్లమనీ ప్రాధేయపడ్డాడు. అంతా విని అతను అన్నాడు.

''సారీ సార్! ఇలా జరిగినందుకు నేను చాలా విచారిస్తున్నాను. ఇక మా సమస్య వినండి. లోపల డెబ్బై ఐదేళ్ల మా అమ్మ ఉంది. ఆవిడ ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే. ఆవిడకు వెంకన్న సుప్రభాత సేవా దర్శనం చెయ్యాలని ఎప్పట్నుంచో కోరిక. మా అన్నదమ్ములం నలుగురూ స్టేట్స్‌లో వివిధ ప్రదేశాల్లో ఉండడం వల్ల అది ఇన్నాళ్లూ కుదరలేదు. చాలా సంవత్సరాల నుంచి అది వాయిదా పడుతూ వస్తోంది. ఈ తెల్లవారు ఝామున నాలుగు గంటలకు జరిగే సుప్రభాత సేవలో పాల్గొనేందుకు మాకు టిక్కెట్లు రిజర్వ్ అయ్యాయి. మా తమ్ముడి ఫ్లైట్ లేటవ్వడం వల్ల ఇప్పటికే బాగా ఆలస్యం అయింది. ఇప్పుడు త్వరగా వెళ్లి ఆ సేవలో పాల్గొనకపోతే మా అమ్మకి ఈ జన్మలో మరి సాధ్యం కాదు. అందుకనీ మీకు సహాయం చేసే స్థితిలో మేము లేమని చెప్పడానికి నాకు చాలా బాధగా ఉంది'' అన్నాడు అతను.

రామారావు చేసేదేం లేక ఆ

## ఇదేం పెళ్లో ఏంటో?


**అభిషేక్ బచ్చన్‌తో ఐశ్వర్యారాయ్ పెళ్లి ఎప్పుడు జరుగుతుందోగానీ ఈలోగా రోజుకో హాట్ న్యూస్ ప్రచారంలోకి వస్తోంది. తాజా వార్త ఏంటంటే- ఐశ్వర్యకి వున్న కుజదోషం పోవడానికి ఆమె రావిచెట్టుని ముందుగా పెళ్లాడాకే అభిషేక్‌తో తాళి కట్టించుకోవాలట. అందుకనే ఆల్రెడీ ఐశ్వర్య ముంబాయిలోని ఓ రావిచెట్టుతో వివాహ కార్యక్రమాన్ని పూర్తిచేసినట్టు బాలీవుడ్‌లో గుప్పుమంది. తనకంటే వయసులో చిన్నవాడైన అభిషేక్‌ని ఐశ్వర్య పెళ్లాడుతోందంటే ఇప్పుడే ఇంత హంగామా అయితే ఇక వాళ్ల పెళ్లయ్యాక ఇంకెంత వుంటుందో?**



కారుకి అడ్డం తొలిగాడు. కారు బయలుదేరింది. రామారావుకి నీరసం ఆవహిస్తోంది. ఇంతలో కొద్ది దూరం వెళ్లిన కారు మళ్లీ హారన్ కొట్టు కుంటూ వెనక్కు రాసాగింది. రామారావుకి ఒకింత ఆశ్చర్యం వేసింది. కారు ఆగగానే అందు లోంచి ఒక వృద్ధురాలు ఇద్దరి ఆసరాతో కిందకు దిగింది. ఆమె తిన్నగా రామారావ్ కారు దగ్గర కొచ్చి వాళ్ల టార్చ్‌లైట్ చూపిస్తుంటే లోపలికి తొంగి చూసింది. ఆమెతో ఉన్న వాళ్ల బహుశా అతను చెప్పినదాన్ని బట్టి ఆమె కొడుకులనీ పోల్చు కున్నాడు రామారావ్. ఆమె వాళ్లతో అంది ''బాబూ మనం ఇప్పుడు ఇక్కడే ఉందాం. మన కారుని ఆయనకివ్వండి. ఆమెను త్వరగా కిందకు తీసికెళ్లాలి. లేకపోతే ఆమె ప్రాణానికి ప్రమాదం. వెంటనే కారుని తిప్పండి''

అది విని ఆమె మరో కొడుకన్నాడు- ''అదేమి టమ్మా! ఎన్నో సంవత్సరాల నుంచి మనం తిరు మల ఈ సుప్రభాతసేవ చేసుకుందామనే కదా రావాలనుకుంటున్నది. ఏదో ఇన్నాళ్లకు కుదిరితే మళ్లీ ఇదో ఆటంకం. ఇప్పుడు కానీ మనం దర్శిం చుకోకపోతే ఆ సేవ రద్దయిపోతుంది. మనకింక ఒక గంట సమయమే ఉంది. ఇప్పుడు సమయం 3 గంటలైంది. త్వరగా వెళ్లాలి మనం. లేకపోతే మేం విదేశాల నుంచి వచ్చింది వ్యర్థమైపోతుంది. అన్నీ తెలిసీ నువ్వు...''

అతను పూర్తిగా చెప్పక ముందే ఆమె అన్నది- ''నాకన్నీ తెలుసురా బాబూ! నేను చనిపోయే లోగా ఆ ఏడుకొండల వాడికి సుప్రభాత సేవ చేసి పునీతమవ్వాలనుకున్నాను. అది ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. ఇన్నాళ్లకు ఆ కోరిక తీరుతోందని ఎంతో మురిసిపోయాను. కానీ ఆ అమ్మాయి పరిస్థితి చూస్తే వాళ్లకి సహాయపడక పోతే మానవత్వం అనిపించుకోదు. ఆ స్వామి సుప్రభాతసేవ కన్నా ప్రస్తుతం ఆమెను రక్షించ డమే నాకు ముఖ్యం. లేకపోతే ఆ స్వామికి కోపం వస్తుంది. బహుశా ఇదే ఆ స్వామికి మనం చేసే సుప్రభాత సేవేమో? ఆ అమ్మాయిని కాపాడాలనే మనం ఆలస్యంగా వస్తున్నామేమో? మనం ఏం పనిచేసినా అది ఇతరులకు ఉపయోగపడాలి. మానవసేవే మాధ వసేవ. ఈ రోజు సుప్రభాతసేవ కాక పోతే ఆ స్వామిని కంటి నిండా దర్శనం చేసుకొని పునీతమవుదాం. ముందా కారుని తిప్పి, ఆ అమ్మా యిని హాస్పిటల్‌కి తీసుకెళ్లండి'' ఆమె చెప్పిన మాటలు ఆ స్వామి సుప్రభాతంలా ఆ కొండల్లో ప్రతిధ్వ నించాయ్. రామారావు ఆమెలో దైవాన్ని చూశాడు. ఆమెకి రెండు చేతులెత్తి నమస్కారం పెట్టాడు.




★ ★ ★

పదిహేను రోజుల తరువాత రామారావు తన ఛాంబర్‌లో ఉండగా పర్సనల్ మేనేజర్ వచ్చి చెప్పాడు ''సార్! మొన్న జరిగిన ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిన అభ్యర్థికి పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వాలి. మీరు ఆర్డర్స్ ఇస్తే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇస్తాం''

రామారావ్ కొద్దిసేపు ఆలోచించి చెప్పాడు. ''నిజానికి ఈ రోజు అపాయింట్‌మెంట్ అయ్యే అభ్యర్థికి కావలసిన మార్కులు రాలేదు. కానీ అత నికే ఈ ఉద్యోగం ఇవ్వాలని నేను నిర్ణయించుకు న్నాను. అతను మీకు తెలుసు 'శ్రీనివాస్' అనీ మన కంపెనీలో పనిచేసి చనిపోయిన రాజయ్య కొడుకు. నేను ఆ కుటుంబం గురించి ఆరాతీ శాను. నిజంగానే వాళ్ల కష్టాల్లో ఉన్నారు. అందుకే ఆ కుటుంబాన్ని ఆదుకోవలసిన అవసరం మన కంపెనీ మీద ఉంది. అందుకే ఆ రాజయ్య కొడుక్కే పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వండి'' అంటూ ఒక నోట్‌పై సంతకం చేసి అతనికిచ్చేడు రామారావ్.

అతను వెళ్లిన తరువాత రామారావ్ ఆలోచిస్తు న్నాడు. నిజంగా ఆమె ఎవరో నా కళ్ల తెరిపిం చింది. ఆ రోజు రాత్రి ఆ కొండపై ఆమె చేసిన సహాయం వల్ల తన కూతురు ఆరోగ్యం కుదుటప డింది. నిజంగా ఆమె మంచి గంధం చెట్టు లాంటిది. ఆమెని చూసి చాలా నేర్చుకోవాలి. అత నికిప్పుడు ప్రశాంతంగా ఉంది. మొదట్లో ఈ ఉద్యోగాన్ని తన బావమరిదికివ్వాలనుకున్నప్పుడు తనలో ఏదో తెలియని అశాంతి, అదే అతనికిస్తే జీవితాంతం తను తప్పు చేశానని బాధపడి ఉండే వాడు. ఆ మహాతల్లి తనకు మహోపకారం చేసింది. కానీ తమ వల్ల ఆమె చిరకాల వాంఛ అయిన ఆ స్వామి సుప్రభాత సేవ ఆమెకు దక్క లేదు. ఆ విషయం గుర్తొచ్చినప్పుడల్లా అతనికి మనశ్శాంతి కరువవుతోంది. అతనిలో అంతర్మ థనం మొదలవుతోంది.

ఇంతలో పోస్ట్‌మాన్ తెచ్చిచ్చాడని ఒక కవర్ పట్టుకొచ్చాడు ప్యూన్ రాజు. దాని ఫ్రమ్ ఎడ్రస్ చూసి ఆ ఉత్తరాన్ని తెరిచి చదవటం మొదలుపె ట్టాడు రామారావ్.

''ప్రియమైన రామారావ్‌గారికి,

ప్రసాద్ వ్రాయునది. నేనెవరో గుర్తుపట్టారా? ఆ రోజు తిరుమల ఘాట్‌రోడ్డులో మీ అమ్మా యిని హాస్పిటల్‌కి తీసుకెళ్లడానికి కారు లిఫ్ట్ ఇచ్చిన పెద్దామె కొడుకుని. ఇంతకీ ఈ ఉత్తరం ఎందుకు రాస్తున్నానంటే ఒక ముఖ్య విషయం తెలియపర చాలని.

ఆ రోజు మీ అమ్మాయిని హాస్పిటల్‌లో జాయిన్ చేసి మేము తిరిగి వెళుతున్నప్పుడు మా అమ్మకు మీ వల్లే సుప్రభాత దర్శనం తప్పిపోయి నందుకు మీరు చాలా బాధపడుతూ మాకు వీడ్కోలు పలికేరు. ఆరోజు మాకూ బాధ వేసింది మా అమ్మ కోరిక తీరనందుకు. కానీ విచి త్రంగా మేము తిరుమలకొండపైకి వెళ్లేసరికి ఆ రోజు రాష్ట్ర గవర్నర్ రావడం వల్ల సుప్రభాతదర్శ నంతో పాటు అన్ని సేవలనూ, దర్శనాలను రద్దు చేసి, ఆ అవకాశం కోల్పోయిన భక్తులకు మర్నాడు ఆ దర్శనభాగ్యం కల్పించారు టి.టి.డి. వారు. అది విన్న మాకు ఎంతో ఆనందం కలి గింది. మా అమ్మకైతే సరేసరి.

చూశారా! మనం చేసిన మంచి పని వల్ల ఆ స్వామి మనల్ని చల్లగా చూశాడు. ఆ దర్శనం చెయ్యాలన్న తొందరలో వాళ్లకి సహాయం చేయక పోతే ఆ బాధ జీవితాంతం నన్ను వేధించేది- అని మా అమ్మ ఎంతో ఆనందంతో చెప్పడం మాకెంతో ప్రశాంతతనిచ్చింది.

ఆ మర్నాడు మా అమ్మతో సహా మేమందరం ఆ స్వామిని సుప్రభాత వేళ దర్శించి, సేవ చేసు కున్నాం. మా అమ్మ చిరకాల వాంఛని నెరవేర్చగ లిగాం.

అందుకే ఈ విషయం మీకు తెలియపర్చాలని ఈ ఉత్తరం రాస్తున్నాను, లేకపోతే మీ మనసులో ఒక అపరాధ భావం శాశ్వతంగా ఉండిపోతుంది. అది మాకు మంచిది కాదనిపించింది.

ఇక మీ అమ్మాయి ఆరోగ్యం బాగుందని తలు స్తాను. మీ కుటుంబంలోని వారందరికీ నా నమస్కారములు.

ఉంటాను

ప్రసాద్''

ఆ ఉత్తరం చదివిన తరువాత అతని మనసు తేలికపడింది. అంతా ఆ స్వామి దయ అనుకొని ఆయనకు మన సులోనే అంజలి ఘటించాడు రామా రావ్.